

## కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జిల్లా నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, శానంపూడి సైదిరెడ్డి, నోముల భగత్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్ ఉన్నారు.





# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- జిల్లాలో నేరాలు తగ్గించేందుకు ఎప్పటికప్పుడు సమీక్ష
- గంజాయి రవాణా నివారణకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్

### నూతన ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ సిటీ, జనవరి 1 : నల్లగొండ జిల్లా కొత్త ఎస్పీగా చందనా దీప్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం పోలీస్ హెడ్ క్వాటర్‌లో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి సిబ్బంది, ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అరికడుతామన్నారు. గంజాయి మాదక ద్రవ్యాల వల్ల ఎన్నో కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, దాని నిర్మూళనకు స్పెషల్ ట్రాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో నేషనల్ హైవేలు ఎక్కువ ఉండడంతో ప్రమాదాలు ఎక్కువ చోటుచేసుకుంటున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దొంగతనాల నివారణకు పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, ఇండ్లు, షాపుల యజమానులు సొంతంగా సీసీ కెమెరాలు పెట్టుకోవడం మంచిదని సూచించారు. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకుంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు ప్రత్యేక ట్రాస్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు పోలీసు సిబ్బందితో సమీక్షించి జిల్లాలో నేరాల శాతాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం అందరి సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. ఎస్పీగా చందనా దీప్తి నియామకం కావడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

# నూతనోత్సాహం

### కోటి ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతం



యాదగిరిగుట్ట ఆలయ ఆవరణలో భక్తజనం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్న ప్రజలు
- ఆలయాలు, చర్చిలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన యాదగిరి గుట్ట దేవస్థానం



నల్లగొండలో న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. 2024 సంవత్సరానికి ప్రజలు గ్రాండ్ వెల్‌కమ్ పలికారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కేక్ కటింగ్‌లు చేసి స్వీట్లు పంచుకున్నారు. పటాకులు పేల్చి కేరింతలతో హోరెత్తించారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా జనం సంబురాల్లో మునిగి తేలారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇంటి ముంగిళ్లను రంగవల్లులతో అలంకరించారు. తమ ఇష్ట దైవాలను దర్శించుకొని ఆశలు నెరవేరాలని, సంవత్సరం అంతా మంచి జరుగాలని కోరుకున్నారు. యాదగిరి గుట్ట ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# 2024లో మరిన్ని వెలుగులు నిండాలి

- సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగుదాం
- ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



సూర్యాపేటలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట టౌన్, జనవరి 1 : 2024 సంవత్సరంలో అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని, అన్ని రంగాల ప్రజలంతా సరికొత్త ఆలోచనలతో, ఐక్యతతో ముందుకు సాగాలని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసింది. మొక్కలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే 2023 వచ్చి వెళ్లిపోయిందని, కాలం ఎవరి కోసం ఆగదు.. అందుకే సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. 2024 ఏడాదంతా అందరికీ మంచి జరుగాలని, మరింత అభివృద్ధితో ముందుకు సాగుదామని అన్నారు. ఉద్యమ సమయంలోనే అందరి కష్టాలు తెలుసుకున్న కేసీఆర్ తొమ్మిదన్నరేండ్లలోనే నిరంతర అభివృద్ధి పాలనతో, వినూత్న పథకాలతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో సాధించుకున్న రాష్ట్రాన్ని ఎవరూ ఊహించని రీతిలో తీర్చిదిద్ది అన్ని రాష్ట్రాలు మన వైపు చూసేలా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతున్నదని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్, పుష్కలంగా తాగు, సాగునీరు, ఆసరా పింఛన్లు, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, దళితబంధు వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకలు, అభిమానులు ఉన్నారు.



రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి


## అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడాలి : ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, జనవరి 1 : రెడ్డి సంక్షేమ సంఘం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. ఈ భవనంలో అన్ని వర్గాల వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శాగ జయలక్ష్మి, వంగాల నిరంజన్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు అనుముల మధుసూదన్‌రెడ్డి, చెన్నారెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికలపై గురి

### మార్చిలోనే ఎన్నికలు ఉండొచ్చని అంచనా

- ఎన్నికల సన్నద్ధంలో అధికార యంత్రాంగం
- సత్తా చాటేందుకు రాజకీయ పార్టీల కసరత్తు
- ఈ నెల 13, 16 తేదీల్లో బీఆర్ఎస్ సమావేశాలు
- కాంగ్రెస్, బీజేపీ నుంచి ఆశావహుల హడావుడి
- మొదలైన ఎన్నికల వాతావరణం



**అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపోటములపై చర్చ కొనసాగుతుండగానే లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలైంది. ఫిబ్రవరిలో షెడ్యూల్ విడుదలై మార్చిలోనే పోలింగ్ జరుగుతుందన్న వార్తల నేపథ్యంలో అందరి దృష్టి లోక్‌సభ ఎన్నికలపై పడింది. ఇప్పటికే అధికార యంత్రాంగం ఓటర్ల జాబితా సవరణపై దృష్టి సారించింది. ఇక రాజకీయ పార్టీలు సైతం ఎన్నికల్లో సత్తా చాటేందుకు కసరత్తు మొదలుపెట్టాయి. ఈ నెల 3 నుంచి లోక్‌సభ స్థానాల వారీగా సమావేశాలకు బీఆర్ఎస్ షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు 13న భువనగిరి, 16న నల్లగొండ లోక్‌సభ స్థానాలపై పార్టీ అధినేత కేసీఆర్ సమీక్ష చేయనున్నారు. ఇక ఇదే సమయంలో కాంగ్రెస్, బీజేపీలు సైతం సన్నాహకాలను వేగవంతం చేశాయి. ఆయా పార్టీల నుంచి ఆశావహులు టికెట్ల వేటలో రంగంలోకి దిగారు. దాంతో రానున్న కొద్ది రోజుల్లోనే లోక్‌సభ ఎన్నికల హీట్ మొదలుకానున్నది.**

నల్లగొండ ప్రతినిధి, జనవరి1(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, లోక్‌సభ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు సైతం ప్రతిష్టాత్మకంగానే భావిస్తున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలన్న తలంపుతో కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలను గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందగా.. మరోసారి తమ సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకునేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే నల్లగొండకు మంత్రి ఉత్తమ్‌ను, భువనగిరికి మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఇన్‌చార్జీలుగా కాంగ్రెస్ పార్టీ నియమించింది. పైగా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాల స్ఫూర్తితో లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో కాంగ్రెస్ కనిపిస్తుంది. అయితే, ఆ పార్టీ నుంచి టికెట్లు ఆశిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉండడంతో అభ్యర్థుల ఎంపిక ఆసక్తికరంగా మారింది. నల్లగొండ నుంచి ప్రధానంగా మాజీ మంత్రి జానారెడ్డి, లేదంటే ఆయన కుమారుడు రఘువీర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. ఇక భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీ గౌడ్, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి పేర్లు టికెట్ రేస్‌లో ఉన్నాయి. బీజేపీ సైతం లోక్‌సభ ఎన్నికల్లో తమ పట్టు బిగించాలని భావిస్తున్నా.. ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని రాజకీయ విశ్లేషకుల అంచనా. అయితే కేంద్రంలోని మోదీ చరిష్మా కలిసొస్తుందని ఆ పార్టీ నేతల భావన. ఇక ఇదే సమయంలో బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికలపై పూర్తి స్థాయిలో సమయాత్తం అవుతున్నది.

### ఈ నెల 13,16 తేదీల్లో సమీక్ష

లోక్‌సభ స్థానాల వారీగా సమీక్షలకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతుంది. ఈ నెల 3వ తేదీ నుంచి మొదలుకానున్న సమావేశాల్లో భాగంగా 13వ తేదీన భువనగిరి, 16వ తేదీన నల్లగొండ లోక్‌సభ స్థానాల రివ్యూ జరుగనున్నది. ఇందులో పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలంతా పాల్గొననున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిస్థితి, అభ్యర్థులపై స్పష్టత, ఎన్నికలకు సన్నద్ధం, తదితర అంశాలపై అధినేత కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నట్లు సమాచారం. సమావేశాల అనంతరం పార్టీ యావత్తు ఎన్నికల కదనరంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు మార్చిలోనే వస్తాయన్న అంచనాతోనే సమాయత్తం కావాలన్నది లక్ష్యంగా కనిపిస్తున్నది. రెండు లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా రంగంలోకి దిగనున్నారు.

### అధికార యంత్రాంగం సన్నద్ధం..

ఎన్నికలకు అధికార యంత్రాంగం కూడా సన్నద్ధమవుతున్నది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటర్ల జాబితా సవరణ చేపట్టారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జనవరి1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారికి కొత్తగా దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అదే సమయంలో గుర్తింపు కార్డుల పంపిణీ, మరణించిన వారి ఓటర్ల వివరాల తొలగింపు, ఇతర పొరపాట్లను సవరించేలా చర్యలు చేపట్టారు. ఈ నెల 6వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటించి 22 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఫిబ్రవరి8న తుది జాబితా ప్రకటిస్తారు. ఇదే సమయంలో 1,450 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఉండేలా చర్యలు మొదలుపెట్టారు. అదనపు పోలింగ్ కేంద్రాల గుర్తింపును చేపట్టారు. అన్ని వైపులా ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగాలు పూర్తి స్థాయిలో దృష్టి సారించాయి.

# న్యూ ఇయర్ కిక్

- ఉమ్మడి జిల్లాలో తెగ తాగిన మద్యం ప్రియులు
- రెండ్రోజుల్లోనే రూ.44కోట్ల లిక్కర్ విక్రయాలు
- ఇయర్ ఎండింగ్.. ఆపై వీకెండ్ కలిసి రావడంతోనే..



నల్లగొండ, జనవరి 1 : న్యూ ఇయర్ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో మద్యం ఏరులైపారింది. రికార్డు స్థాయిలో మద్యం సేల్స్ జరుగగా.. రాష్ట్ర ప్రభుత్వానికి మస్తు ఆదాయం సమకూరింది. డిసెంబర్ 30, 31 తేదీల్లో అమ్మకాలు జోరుగా కొనసాగాయి. ఈ రెండ్రోజుల్లోనే రూ.44.13 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. అంతకు ముందు రోజు డిసెంబర్ 29న కూడా రూ.16కోట్ల మద్యం సేల్స్ జరిగాయని ఆబ్కారీ శాఖ లెక్కలు చెప్తున్నాయి. అంటే ఈ మూడు రోజుల్లోనే రూ.60 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి.

### ఇయర్ ఎండింగ్.. పైగా వీకెండ్

డిసెంబర్ 31.. అందునా వీకెండ్.. ఇంకేముంది మస్తు దావత్‌లు. ఖుషీ ఖుషీగా ఎంజాయ్‌మెంట్‌లు.. పైగా సోమవారం గవర్నమెంటు సెలవు ఇవ్వడంతో మద్యం ప్రియులకు మస్తు మత్తు ఎక్కింది. శనివారం, ఆదివారం మందుతో ఎంజాయ్ చేసి ఉర్రూతలూగిన తర్వాత కనిపించింది ఈ మందు బాబులకు జేబులో ఉన్న పైసలు చిత్తు కాగితాల్లా ఎగిరిపోయాయని. డిసెంబర్ 31 ఆదివారం, అంతకుముందు శనివారం కావడంతో ప్రైవేటు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్‌తోపాటు ఇతరులు ఈ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఎంతో జోష్‌తో జరుపుకొన్నారు. పైగా జనవరి 1న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతో ఈ రెండు రోజులు మద్యం ప్రియులు ఎంతో ఎంజాయ్ చేశారు. శుక్రవారం రాత్రి మొదలు సోమవారం వరకు తన స్నేహితులు, బంధువులతో కలిసి సరదాగా గడిపారు. అయితే.. ఈ ఏడాది ఒకటి, రెండు చిన్న చిన్న సంఘటనలు మినహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొత్త సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి.

### మూడ్రోజుల్లో రూ.60కోట్ల విక్రయాలు

ఇయర్ ఎండింగ్ అయిన డిసెంబర్ 30, 31 తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. దాంతో రాష్ట్ర ఆబ్కారీ శాఖకు భారీ ఆదాయం సమకూరింది. ఇయర్ ఎండింగ్‌లో రెండ్రోజుల మద్యం అమ్మకాల లెక్కలు కండ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయి. డిసెంబర్ 30న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 28,895 మద్యం కాటన్లు, 31,503 కాటన్ల బీర్లు బాట్లింగ్ కంపెనీ నుంచి సరఫరా అయ్యాయి. వాటి విలువ రూ.29.56 కోట్లు. డిసెంబర్ 31న 14,550 కాటన్ల మద్యం, 21,962 కాటన్ల బీర్లు సరఫరా కాగా.. వాటి విలువ 14.57 కోట్ల రూపాయలు. మొత్తంగా ఈ రెండు రోజుల్లో 43,445 మద్యం కాటన్లు, 53,465 కాటన్ల బీర్లు అమ్ముడయ్యాయి. అంటే రూ.44.13 కోట్ల విలువైన మద్యం సరఫరా చేయబడింది. అంతకుముందు రోజు డిసెంబర్ 29న కూడా రూ.16కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని ఆబ్కారీ శాఖ లెక్కలు చెప్తున్నాయి. మొత్తంగా ఈ మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రూ.60 కోట్ల మందును మద్యం ప్రియులు తాగేశారు.



నల్లగొండ బాలుర జట్టుకు ప్రథమ బహుమతి అందజేస్తున్న జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్

## నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి విజేత నల్లగొండ

- బాలికల విభాగంలో రన్నరప్‌గా నిలిచిన జిల్లా జట్టు

నందికొండ, జనవరి 1 : నందికొండ హిల్‌కాలనీలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. ట్రెడిషినల్ రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో నల్లగొండ జట్టు విజేతగా నిలిచి ప్రథమ బహుమతి గెలుచుకుంది. నారాయణపేట జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలికల విభాగంలో మేడ్చల్ జట్టు ప్రథమ, నల్లగొండ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. సోమవారం నిర్వహించిన ఫాస్ట్ ఫైవ్ ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో నారాయణపేట జట్టు విజేతగా, మహబూబ్‌నగర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలికల విభాగంలో నల్లగొండ జట్టు విజయం సాధించగా.. మేడ్చల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. అనంతరం విజేతలకు జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి, ఉపాధ్యక్షులు సారత్ ఖాన్, మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్, ఉమ్మడి నల్లగొండ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, పీఈటీ అనూరాధ, పాఠశాల హెచ్‌ఎం అన్నమ్మ, ఆర్గనైజింగ్ సభ్యులు పాల్గొన్నారు.